
# బాదుడే.. బాదుడు!

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రజలపై బాదుడు కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, చేయలేమని చేతులెత్తేసిన ప్రభుత్వం ప్రజలపై మాత్రం మోయలేని భారాలు మోపుతోంది. నిత్యావసర సరకుల ధరలు, విద్యుత్ చార్జీల బాదుడుకు అదనంగా రేపటి నుంచి భూ రిజిస్ట్రేషన్ల విలువ పెంపు రూపంలో మరో బాదుడు మొదలెట్టారు. నియోజకవర్గంలోని సబ్బవరం మండలంలో ఈ బాదుడు మరీ ఎక్కువగా ఉంది.



సబ్బవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, (ఇన్‌సెట్) పెరిగిన భూ విలువపై నోటీస్ బోర్డులో వేలాడదీసిన నోటిఫికేషన్

- రేపటి నుంచే పెంచిన రిజిస్ట్రేషన్ ధరల అమలు
- వంగలిలో రెండు రెట్లకు పైగా పెంచిన భూ విలువ
- రియల్ ఎస్టేట్ రంగంపై తీవ్ర ప్రభావం



**సబ్బవరం: భూ రిజిస్ట్రేషన్ ధరలను భారీగా పెంచుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి 1 నుంచి పెంచిన భూ విలువ మేరకు రిజిస్ట్రేషన్ల ధరలు అమల్లోకి రానున్నాయి. ఈ ప్రభావం భూ క్రయ విక్రయాలపై భారీగా ఉంటుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్నవారైతే.. కనీసం రెండు మూడేళ్లు ఆ ప్రభావం తమపై ఉంటుందని చెప్తున్నారు. సబ్బవరం మండలంలో భూముల విలువ భారీగా పెరిగింది. వంగలి గ్రామంలో ఏకంగా 212 శాతం పెరగడం గమనార్హం.**

**వంగలిలో వీర బాదుడు!**

**మండలంలో అత్యధికంగా వంగలి** గ్రామంలోనే **భూముల** విలువ పెంచారు. ప్రస్తుతం చదరపు గజం ప్రభుత్వ విలువ రూ.1,100 ఉండగా దాన్ని మూడింతల(రూ.3,500)కు చేర్చారు. సెంటు ప్రభుత్వ ధర ఇప్పటి వరకూ రూ.8,500 ఉండేది. దాన్ని రూ.18 వేలకు పెంచారు. ఈ గ్రామంలో గతంలో అత్యధికంగా ప్రభుత్వ భూములు ఉండేవి. ఇండియన్ మారీటైం యూనివర్సిటీ, పెట్రో యూనివర్సిటీ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ తదితర నిర్మాణాలకు 450–500 ఎకరాల వరకు రైతుల నుంచి ప్రభుత్వం భూ సేకరణ జరిపింది. మండలంలోని మిగిలిన గ్రామాల్లో ప్రభుత్వ విలువ కనిష్ఠంగా రూ.15 వేలకు పైనే ఉన్నా.. వంగలిలో రూ.8,500 మాత్రమే ఉండేది. బహిరంగ మార్కెట్లో సెంటు ధర రూ.2 లక్షల నుంచి రూ.2.5 లక్షలకు పైనే. ఇక్కడ భూ సేకరణ పూర్తయి, పరిహారం చెల్లించిన తర్వాత భూముల విలువ భారీగా పెంచడంతో, క్రయ విక్రయాల సమయంలో తీవ్ర భారంగా మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మధ్యతరగతిపై భారం

తాజా రిజిస్ట్రేషన్ల ధరల పెంపుతో మధ్యతరగతి వారి సొంతింటి కల మరింత భారంగా మారనుందని నిపుణులు చెప్తున్నారు. పైసా పైసా పొదుపు చేసుకుని, ఆపై బ్యాంకు రుణంతో ఈ ఏడాది ఓ 100 చ.గ. స్థలాన్ని తీసుకోవాలని ఆశపడ్డవారు మరో ఐదారేళ్లు వెనుకడుగు వేయాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. **మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ రహదారుల విస్తరణ సమయంలో ఈ రిజిస్ట్రేషన్ ధరలు పెంచినట్లయితే రైతులకు పరిహారం చెల్లింపులో భారీ లబ్ధి చేకూరేదని స్థానికులు చెబుతున్నారు. అన్నీ అయిపోయాక రిజిస్ట్రేషన్ ధరలు పెద్ద మొత్తంలో పెంచడం సామాన్యుల నడ్డి విరిచేందుకేనని ఆక్షేపిస్తున్నారు.**

**మండలంలో భారీగా ధరలు పెరిగిన గ్రామాలు (రూ.లలో)**

| రెవెన్యూ గ్రామం | చదరపు గజాల్లో పాత ధర | చదరపు గజాల్లో పెంచిన ధర | సెంట్లలో పాత ధర | సెంట్లలో పెంచిన ధర |
|---|---|---|---|---|
| వంగలి | 1,100 | 3,500 | 8,500 | 18,000 |
| ఎ.సిరపపల్లి | 600 | 2,000 | 11,000 | 15,000 |
| అమృతపురం | 2,500 | 4,000 | 24,000 | 30,000 |
| సబ్బవరం | 5,500 | 7,000 | 63,000 | 80,000 |
| బంగారమ్మపాలెం | 1,100 | 2,000 | 11,000 | 20,000 |
| రాయపుర అగ్రహారం | 1,100 | 3,000 | 16,500 | 25,000 |
| నారపాడు | 1,700 | 3,000 | 19,000 | 25,000 |
| ఇరువాడ | 2,500 | 5,000 | 26,000 | 35,000 |
| అయ్యన్నపాలెం | 1,300 | 2,000 | 18,000 | 25,000 |
| ఎల్లుప్పి | 1,700 | 3,500 | 16,000 | 22,000 |

### భూ సేకరణలో నష్టపోయాం



మా గ్రామంలో పలు విశ్వవిద్యాలయాలకు రైతుల నుంచి గతంలో పెద్ద మొత్తంలో భూములు సేకరించారు. మండలంలో అన్ని గ్రామాల కంటే మా గ్రామంలో భూముల ధరలు బహిరంగ మార్కెట్‌లో రెట్టింపు ఉంటే, ప్రభుత్వ ధర మిగిలిన గ్రామాల ధరలో సగం కూడా ఉండేది కాదు. దీంతో భూ సేకరణ సమయంలో రైతులకు తక్కువ పరిహారమే దక్కింది. త్రీవంగా నష్టపోయాం.

– యర్ర సోంబాబు, పెట్రో వర్సిటీ భూ నిర్వాసితుడు, వంగలి

### రియల్ ఎస్టేట్ మరింత కుదేలు



పెంచిన రిజిస్ట్రేషన్ ధరలు రియల్ ఎస్టేట్ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. గత ప్రభుత్వంలో విశాఖ రాజధానిగా ప్రకటించడంతో నగరానికి సమీపంలో ఉండే భూములకు ఎంతో డిమాండ్ ఉండేది. రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగేది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ రంగం మందగించింది. ఇప్పుడు భూముల విలువ పెంపుతో మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లయింది.

– బుద్ధరాజు కృష్ణంరాజు, రియల్టర్, ఆరిపాక

### పునరాలోచన చేయాలి



రేపటి నుంచి ప్లాట్లు, వ్యవసాయ భూముల ధరలు 10 నుంచి 20 శాతానికి పైగా పెరగం వల్ల రియల్ ఎస్టేట్ చేసే వ్యాపారులు, సామాన్య ప్రజలపై చాలా భారం పడుతుంది. ఏటా ఆగస్టులో మార్కెట్ విలువ సవరణ ఉండేది. ఇప్పుడు కాస్త ముందుగానే చేస్తున్నారు. భారీగా పెంచిన రిజిస్ట్రేషన్ ధరలపై ప్రభుత్వం పునరాలోచించుకోవాలనే డిమాండ్ ప్రజల నుంచి ఎక్కువగా వస్తోంది.

– ఎస్.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ, ఏపీ దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం

### అభ్యంతరాలను స్వీకరిస్తున్నాం



పెంచిన భూ రిజిస్ట్రేషన్ ధరలపై జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లతో జాయింట్ కలెక్టర్ ఇటీవల సమీక్ష నిర్వహించారు. గతంలో మండలంలోని ఐదారు గ్రామాల్లో మాత్రమే ధరలను పెంచారు. 2019, 2020లలో ధరలు పెంచని గ్రామాల్లో కొంత పెద్ద మొత్తంలో ఇప్పుడు పెంచారు. మిగిలిన గ్రామాల్లో తక్కువే పెరిగింది. పెరిగిన ధరలను కార్యాలయంలో ప్రదర్శించి, అభ్యంతరాలను స్వీకరిస్తున్నాం.

– జిలానీ బేగమ్, సబ్ రిజిస్ట్రార్, సబ్బవరం

## క్లుప్తంగా

### వెంకన్న ఆలయంలో శ్రవణ నక్షత్ర హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం హోమాన్ని వైభవంగా నిర్వహించారు. చక్రపెరుమాళ్లని ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ ప్రాంగణంలో ఉన్న మండపంలో వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను విశేషంగా జరిపారు. కుంభ ప్రోక్షణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం యజ్ఞప్రసాదాన్ని భక్తులకు అందించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు శ్రీకాంత్, భార్గవ్ ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

### రేపు 'నైతికత, మానవ విలువలు' పరీక్ష

- 3న పర్యావరణ విద్య పరీక్ష

సబ్బవరం: ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నైతిక, మానవ విలువలు సబ్జెక్టు పరీక్ష నిర్వహించనున్నట్లు సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీవీఎస్ మూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 3న పర్యావరణ విద్య పరీక్ష జరుగుతుందన్నారు. బోర్డ్ అఫ్ ఇంటర్మీడియట్ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ పరీక్షలకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు విధిగా హాజరుకావాలన్నారు. లేకుంటే మిగిలిన సబ్జెక్టులన్నీ పాసైనా.. ఉత్తీర్ణులుగా పరిగణించబోరని పేర్కొన్నారు. గతంలో ఈ పరీక్షకు గైర్హాజరైన విద్యార్థులు తప్పనిసరిగా ఈసారి హాజరై ఉత్తీర్ణులు కావాలని సూచించారు.

### అప్పన్న సన్నిధిలో రామచంద్రమోహన్



రామచంద్రమోహన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దేవస్థానం అధికారులు

సింహాచలం: రాష్ట్ర దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామచంద్రమోహన్ గురువారం సింహాచలం దేవస్థానాన్ని సందర్శించారు. ఈ నెల 4న అరసవెల్లిలో రథసప్తమి వేడుకల సందర్భంగా అక్కడి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించేందుకు వెళ్తూ సింహాచలం దేవస్థానానికి వచ్చారు. కొండదిగువ పరిపాలనా కార్యాలయంలో కొంతసేపు దేవస్థానం ఈవో వి.త్రినాథరావుతో సమావేశమయ్యారు. ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు తీసుకుని తొలిసారి సింహాచలం దేవస్థానానికి రావడంతో వైదికులు, ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్చాలు అందించి, శాలువాలు వేసి, అభినందలు తెలిపారు.


### 'ఉల్లాస్'ను విజయవంతం చేయాలి



మండల స్థాయి శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పద్మజ

సబ్బవరం: వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో విజయవంతం చేయాలని ఎంపీడీవో పి.పద్మజ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో వెలుగు సిబ్బందితో పాటు మిగిలిన అధికారులకు ఉల్లాస్‌పై గురువారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో మాట్లాడుతూ ప్రాథమిక, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతతోపాటు, ఆరోగ్య సంరక్షణపై అవగాహన, కుటుంబ సంక్షేమం, జీవన నైపుణ్యాల మెరుగు ఈ పథకం ప్రధాన లక్ష్యమన్నారు. గ్రామాల్లో వయోజన నిరక్షరాస్యులను గుర్తించి, అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులకు, పాఠశాల, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది, ఆయాలు, సహాయకులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బి.చైతన్య, వెలుగు ఏపీఎం సీహెచ్ శ్రీనివాసరావు, వీవోఏలు, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

## 'వియాష్ పరిశ్రమపై చర్యలు తీసుకోండి'




వియాష్ లైఫ్ సైన్సెస్ పరిశ్రమ బోర్డు

పరవాడ: రసాయన వ్యర్థజలాలను విడుదల చేస్తూ ప్రజల ప్రాణాలకు హాని కలిగిస్తున్న ఫార్మాసిటీలోని వియాష్ లైఫ్ సైన్సెస్ పరిశ్రమ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం పరిశ్రమ నుంచి పైపులైన్ ద్వారా వ్యర్థ రసాయనాలను విడుదల చేసే క్రమంలో పైపులైన్ పగిలిపోయి వ్యర్థ జలాలు బయటకు వచ్చి పరిసర ప్రాంతాలు కలుషితమయ్యాయన్నారు. ఫలితంగా భూగర్భ జలాలు కలుషితం కావడంతో ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పరిశ్రమ నుంచి యథేచ్ఛగా రసాయన వ్యర్థాలను కాలువల ద్వారా చెరువులు, గెడ్డలు, వ్యవసాయ కాలువల్లోకి విడుదల చేయడంతో పంటలు నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విషపూరిత రసాయన వ్యర్థ జలాల విడుదలకు కారణమైన వియాష్ యాజమాన్యంపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.

## వృత్తి విద్యపై ప్రత్యేక దృష్టి



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న విద్యాశాఖ అధికారులు

పెందుర్తి: నేటి విద్యారంగంలో వృత్తి విద్యకు చక్కటి ప్రాధాన్యత ఉందని జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ చంద్రశేఖరరావు అన్నారు. పాఠశాల స్థాయిలో 9, 10 తరగతుల నుంచే వృత్తి విద్యపై పూర్తిస్థాయి దృష్టి సారిస్తున్నామన్నారు. పీహెచ్‌డీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సహకారంతో ఎస్‌సీఈఆర్‌టీ పీఏఆర్‌ఏకేహెచ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం రెండు రోజుల వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తివిద్య ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. నైపుణ్యాలు, వృత్తివిద్యా కోర్సుల ఆధారంగా సాంప్రదాయేతర కెరీర్ మార్గాలను అన్వేషించి ఆ దిశగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఎస్‌సీఈఆర్‌టీ స్టేట్ లైజనింగ్ అధికారి అమర్‌దీప్‌కుమార్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) గురించి వివరించారు. ఎస్‌సీఈఆర్‌టీ పీఏఆర్‌కేహెచ్ సీఈవో ఇంద్రాణి బాదురి, పీహెచ్‌డీసీసీఐ జాయింట్ సెక్రటరీ పలాష్ సేన్, ఏఎంవో జి.లక్ష్మి, ఎంఈవో–1 కె.సువర్ణ, ఎంఈవో–2 మధుమూర్తి, హెచ్ఎం చిన్నమ్మాయి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

## పశు ఆరోగ్య శిబిరాలతో పాడి అభివృద్ధి



తానాంలో పశు ఆరోగ్య శిబిరంలో రైతులతో ఏడీ రామకృష్ణకీర్తి

పరవాడ: గ్రామీణ ప్రాంతాల్లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగపర్చుకోవాలని పరవాడ పశు సంవర్ధక శాఖ ఏడీ రామకృష్ణకీర్తి కోరారు. పరవాడ, తానాం గ్రామాల్లో గురువారం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాల్లో పాల్గొని రైతులనుద్దేశించి మాట్లాడారు. లింగ నిర్ధారణ వీర్యనాళికల ద్వారా ఆడ పెయ్యలను పొందవచ్చన్నారు. కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు జాతి పెయ్యలను పొంది, పాడిని మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. శాస్త్రీయ పద్ధతుల ద్వారా కూడా పాల దిగుబడి పెంపొందించుకోవచ్చన్నారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పశు బీమా, పశుగ్రాస విత్తనాలు, చాప్ కట్టర్స్, మిశ్రమ దాణా పథకాలను సద్వినియోగపర్చుకోవాలని రైతులను సూచించారు. పశు ఆరోగ్య శిబిరాల్లో 240 పశువులు, మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. వ్యాధి నిరోధక టీకాలు, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, గర్భ నిర్ధారణ పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో లంకెలపాలెం, వాడచీపురుపల్లి పశు వైద్యులు అశ్విని ప్రఫుల్లా, సురేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పైడితల్లమ్మ తీర్థం



పూజలందుకున్న పైడితల్లి అమ్మవారు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు లగిశెట్టిపాలెంలో కొలువైన పైడితల్లి అమ్మవారి తీర్థమహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, అండిబోయిన పాల్గుణ, బంగారయ్య, కోటిరాజు తదితరులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు.

## అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలను భక్తులతో తాకిస్తున్న అర్చకుడు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**వైభవంగా నిత్యకల్యాణం**

సింహాద్రి అప్పన్నకు నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను కొలువుంచి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

**విశేషంగా గరుడసేవ**

సింహాచలేశుడికి గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజని నిర్వహించారు. విశేష హారతి అందించారు. పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

## ముంచుతున్న మంచు



పెందుర్తి రైల్వే స్టేషన్ వద్ద ట్రాక్‌పై గురువారం ఉదయం కురుస్తున్న పొగమంచు





పెందుర్తి జాతీయ రహదారిపై కురుస్తున్న మంచు

**ఉదయం 8-9 గంటలవుతున్నా.. భానుడు కానరావట్లేదు. పగటి పూట ఉష్ణోగ్రతల్లో స్వల్ప మార్పులున్నా.. సాయంత్రం నుంచి మంచు అధికంగా కురుస్తుండటంతో చలి ప్రభావం కొనసాగుతూనే ఉంది. ఉదయానికి కూడా మంచు ప్రభావం తగ్గుముఖం పట్టట్లేదు. దీంతో రోడ్లపై వాహనదారులు అవస్థలు పడుతున్నారు. 5-10 మీటర్ల ముందున్న వారు కూడా కనిపించక వాహనాలకు లైట్లు వేసుకుని మరీ నెమ్మదిగా సాగుతున్నారు. మరోవైపు మామిడి, జీడి మామిడి తోటల పూతపై ఈ పొగ మంచు తీవ్ర ప్రభావం చూపుతోంది. మంచు కారణంగా పూత మాడిపోతోంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.**

– పెందుర్తి

### ఫ్లెక్సీల తొలగింపు

పెందుర్తి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల పోస్టర్లు, ఫ్లెక్సీల తొలగింపు ప్రక్రియను గురువారం ప్రారంభించారు.

## జాతిపితకు ఘన నివాళి



అడవివరంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కొలుసు ఈశ్వరరావు, పీతల అప్పలరాజు



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి శిరీష తదితరులు

సింహాచలం: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా అడవివరంలోని గాంధీనగర్‌లో ఉన్న గాంధీజీ విగ్రహానికి 98వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. గాంధీజీ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు గాంధీజీ పాటించిన నిబద్ధతను కొనియాడారు. ఉద్యమంలో ప్రధాన పోరాట ఘట్టాలను గుర్తు చేస్తూ, వాటి ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో వార్డు మాజీ అధ్యక్షుడు పీతల అప్పలరాజు, పార్టీ నాయకులు బోర కృష్ణారావు, దమ్ము ఎర్రాజీరావు, ఆదిరెడ్డి, బోర మోహన్‌రెడ్డి, గాంధీనగర్ నివాసితులు పాల్గొన్నారు.

సబ్బవరం: స్థానిక శాఖ గ్రంథాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయ అధికారి వి.శిరీష తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారత స్వాతంత్ర్య సముపార్జనలో గాంధీజీ చేసిన కృషిని, చూపిన దేశభక్తిని వక్తలు కొనియాడారు. ఉప్పు సత్యాగ్రహంతో పాటు భారత స్వాతంత్రోద్యమంలో శాంతి, అహింస అనే ఆయుధాల ద్వారా ఆయన నెరిపిన అనేక ఉద్యమాల గురించి వక్తలు వివరించారు. వాటిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ నళిని, అంగన్‌వాడీ కార్యకర్త చినతల్లి, భవిత కేంద్రం ఉపాధ్యాయుడు సింహాద్రితో పాటు పాఠకులు పాల్గొన్నారు.

## రోడ్డా.. డంపింగ్ యార్డా..?



వాడచీపురుపల్లిలో డంపింగ్ యార్డ్‌గా మారిన రహదారి

పరవాడ: వాడచీపురుపల్లి–పుచ్చెపాలెం గ్రామాల మధ్యఏర్పాటు చేసిన రహదారిని స్థానికులు డంపింగ్ యార్డ్‌గా మార్చేస్తున్నారు. ఇళ్లలో ఊడ్చిన చెత్తాచెదారాన్ని రోడ్డు మీదే వేసేయడంతో దోమల బెడద పెరుగుతోందని సమీప నివాసులు వాపోతున్నారు. రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను సకాలంలో తొలగించని కారణంగా భరించలేని దుర్వాసన వెదజల్లుతోందని, అనారోగ్యాలకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై పేరుకుపోతున్న చెత్తలతో పుచ్చెపాలెం, దండినాయుడుగారి ఊరు, గొల్లపేట గ్రామాలకు రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వాడచీపురుపల్లి నేస్తాలమ్మ సతకం పట్టు, మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌లు చెత్తతో నిండిపోయినా.. సకాలంలో తొలగించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల ఇబ్బందుల్ని గుర్తించి డస్ట్‌బిన్‌లలో, రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని సకాలంలో తొలగించేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.